క్లుప్తంగా

చెరువును అక్రమంగా దున్నితే చర్యలు

రాచర్ల: చెరువు గర్భంలో ట్రాక్టర్‌తో దున్ను తున్న వ్యక్తిని గ్రామ రెవెన్యూ అధికారి హెచ్చరించి, ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన రాచర్ల మండలం యడవల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఈ.రమణయ్య అనే వ్యక్తి తన ట్రాక్టర్‌తో పెద్ద చెరువులో భూమిని అక్రమంగా దున్నుతున్నాడని కొందరు రైతులు వీఆర్వో ఎస్.రంగయ్యకు సమాచారం అందించారు. దీంతో ఆయన చెరువు వద్దకు వెళ్లి ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీఆర్వో మాట్లాడుతూ.. రమణయ్యకు చెందిన సొంత భూమి పక్కనే చెరువు ఉందని, ఈ క్రమంలో తన సొంత భూమిలోకి చెరువు భూమిని కలిపి దున్నుతున్నట్లు గుర్తించి ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


పిచ్చయ్యయాదవ్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలంలోని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యాలయలో యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. గిద్దలూరు మండల అధ్యక్షుడిగా మొర్రి పిచ్చయ్యయాదవ్, గౌరవ అధ్యక్షుడిగా ఈ.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఈ.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా వి.సుబ్బారాయుడు, సహాధ్యక్షులుగా సయ్యద్‌ఖాదర్, బి.అనురాధను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణరెడ్డి పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని ప్రత్యేకంగా అభినందించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా అభయ అంజనేయ, అయ్యప్పస్వామి మాలధారులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. మాలధారులకు గిరిమాజీ వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి కుటుంబ సభ్యులు భిక్ష అందించారు. గురుస్వాములు కనకచార్యులు, ఎస్.సింగరయ్య, ఎం.బాలకృష్ణ, యల్లా రంగస్వామి, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ సేవాసమితి నూతన కమిటీ ఎన్నిక

కంభం: కాకతీయ సేవాసమితి గిద్దలూరు నియోజకవర్గ నూతన కమిటీని ఆదివారం కంభంలో బైరపనేని అధ్యక్షతన ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావూరి వెంకటసుబ్బయ్య, గౌరవ అధ్యక్షుడిగా పోకా చిన్న ఈశ్వరయ్య, కార్యదర్శిగా బోయపాటి వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా కర్నం లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా ఇప్పర్ల వెంకట సత్యనారాయణ, కోశాధికారిగా కర్నం బాల కోటయ్య, మరికొందరు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ నెల 24న ఆదివారం కంభం చెరువుకట్టపై కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేయనున్నట్లు నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

అనాథాశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ


నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సీఐ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పీఆర్ కాలనీలో ఉన్న సంజీవని అనాథ వృద్ధాశ్రమానికి ఎల్ఐసీ ఏజెంట్ కోట సత్యనారాయణ ఆర్థిక సహకారంతో నిత్యావసర వస్తువులను ఆదివారం స్థానిక సీఐ కె.సురేష్ చేతులమీదుగా అందజేశారు. సీఐ మాట్లాడుతూ.. ఆశ్రమంలోని ఒంటరి వృద్ధులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఎదుటి వారికి సహాయం చేయాలనే మంచి ఆలోచన చేసినందుకు సత్యనారాయణను ప్రత్యేకంగా అభినందించారు. తన వంతుగా అనాథాశ్రమానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆశ్రమం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఆశ్రమ నిర్వాహకులు రాజశేఖర్, ఇండియన్ టింబర్ డిపో యజమాని పసుపులేటి శ్రీనివాసులు, ఎస్సై ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

మన వన భోజనం



- కార్తీక మాసంలో మొదలైన వన భోజనాల సందడి
- మార్కాపురం డివిజన్‌లో సమారాధనకు అనువైన ప్రాంతాలు

మార్కాపురం: కార్తీక మాసం ప్రారంభం కావడంతో దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఈ మాసంలో ప్రతి ఒక్కరు వనభోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ఉసిరి చెట్టు క్రింద భోజనాలు చేస్తే పుణ్యం కలుగుతుందని నమ్మకం. మార్కాపురం నియోజకవర్గంలోని మార్కాపురం, కొనకనమిట్ల, తర్లుపాడు ప్రాంతాల్లో వనభోజనాలకు అనువైన ప్రాంతాలు ఉన్నాయి. కార్తీక మాసం ఆరంభంలోనే వన భోజనాల సందడి కూడా మొదలైంది. మార్కాపురం నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం త్రిపురాంతకంలో కార్తీక వనభోజనాలను నిర్వహించారు. సినీ హీరో సుమన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ క్రమంలోనే వివిధ సంఘాల ఆధ్వర్యంలో భక్తులు వన భోజనాల కోసం వచ్చే ఆదివారం మార్కాపురం ప్రాంతంలో ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అనువైన ప్రాంతాలివే..

☛ మార్కాపురం-కొండేపల్లి రోడ్డులో అమ్మవారి పల్లె వద్ద నరసింహస్వామి కొండ సమీపంలో ఉండే ప్రాంతం పచ్చని చెట్ల మధ్య కార్తీక వనభోజనాలకు అనువుగా ఉంటుంది. ఏటా ఇక్కడ వివిధ కులాల ఆధ్వర్యంలో వనభోజనాలు చేస్తుంటారు. షామియానాలు ఏర్పాటు చేసుకుంటే వర్షం వచ్చినా ఇబ్బంది ఉండదు. పట్టణం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి ఆటోల ద్వారా చేరుకోవచ్చు.

☛ మార్కాపురం-తర్లుపాడు రోడ్డులోని అల్లూరి పోలేరమ్మ దేవాలయం వద్ద పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరమైన ప్రాంతం ఉంది. వనభోజనాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇక్కడ నీటి వసతి ఉంది. పట్టణం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి ప్రతి రెండు నిమిషాలకు ఒక ఆటో అందుబాటులో ఉంటుంది.


☛ కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ వెంకటేశ్వర స్వామి దేవాలయం వనభోజనాలకు అనువుగా ఉంటుంది. పచ్చని చెట్లు, కొండల మధ్య ఉండే ఈ ప్రాంతం ఆహ్లాదకర వాతావరణంతో ఉంటుంది. మార్కాపురం పట్టణం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో వెళ్లవచ్చు. ఇక్కడ వివిధ కులాలకు సంబంధించిన సత్రాలు కూడా ఉన్నాయి. తాగునీటి వసతి ఉంది.

☛ తర్లుపాడు మండలంలోని కేతగుడిపిలో ఉన్న శివాలయం వనభోజనాలకు అనువుగా ఉంటుంది. మార్కాపురం పట్టణం నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతానికి ఆటోల్లో వెళ్లవచ్చు.

☛ గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కంభం చెరువు దగ్గర కూడా వనభోజనాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది. అలాగే రాచర్ల మండలంలో ప్రసిద్ధిగాంచిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి వద్ద కార్తీక వన భోజనాలు నిర్వహించుకోవచ్చు. నల్లమల అటవీ ప్రాంతంలో పచ్చని చెట్ల మధ్య ఉండే ఈ ఆలయం పర్యావరణ ప్రేమికులను ఇట్టే కట్టిపడేస్తుంది.


కంభం చెరువు


వెలుగొండ వెంకటేశ్వర స్వామి ఆలయం


నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం

పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు


డీఎం నరసింహులు

మార్కాపురం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. గుంటూరు జిల్లా అమరావతి, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, పాలకొల్లు, తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామం, సామర్లకోటలోని పంచారామ క్షేత్రాలను భక్తులు దర్శించుకోవచ్చని వివరించారు. కార్తీక సోమవారంతో పాటు కోటి సోమవారం, కార్తీక పౌర్ణమి రోజున కూడా భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సులు ప్రతి ఆదివారం రాత్రి పది గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 6 గంటలకు మార్కాపురం చేరుతాయన్నారు. సూపర్‌లగ్జరీ చార్జి 2 వేల రూపాయలుగా నిర్ణయించినట్లు చెప్పారు. భక్తుల కోరిక మేరకు మహానంది, భైరవకోన, శ్రీశైలానికి కూడా ప్రత్యేక సర్వీసులు నడపటంతోపాటు అద్దె ప్రాతిపదికపై కూడా బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 9, 13, 16, 23 తేదీల్లో రాత్రి 10 గంటలకు మార్కాపురం డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి కాణిపాకం, తిరుత్తణి, కంచి, అరుణాచలం, గోల్డెన్ టెంపుల్‌కు చేరుకుంటుందని, 2500 రూపాయలను చార్జీగా నిర్ణయించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. పంచారామాలకు 10, 14, 17, 24 తేదీల్లో బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని నాగశిలలు, పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే పట్టణంలోని ఎస్వీకేపీ కళాశాల రోడ్డులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో అల్లూరి పోలేరమ్మ


కాలేజీ రోడ్డులో పోలేరమ్మ తల్లి

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


ప్రత్యేక పూజల్లో ఉభయదాతలు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఉభయదాతలు సోమిశెట్టి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు మేళతాళాలతో ఆహ్వానించారు. ఆలయ పూజారులు దీవి శ్రీకాంత్ భట్టర్, మురళీకృష్ణమాచార్యులు పూజలు, హోమాలు చేయించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు శ్రావణి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు యక్కలి శేషగిరిరావు, కార్యదర్శి పి.భాస్కర్, కోశాధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వాములకు చద్ది ప్రారంభం


భిక్ష స్వీకరిస్తున్న స్వాములు

పొదిలి: అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక నిర్మమహేశ్వర స్వామి దేవస్థానంలో చద్ది కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. మాలధారణ భక్తులకు దాతల సహకారంతో 50 రోజులపాటు చద్ది ఏర్పాటు చేస్తున్నట్లు గురుస్వాములు యక్కలి శేషగిరిరావు, అప్పల శంకర్ తెలిపారు. హైదరాబాద్‌లో రియల్టర్ నరసింహారెడ్డి రూ.లక్ష, క్లాస్ వన్ కాంట్రాక్టర్ కామసాని రామిరెడ్డి రూ.50 వేలు విరాళంగా ఇచ్చారని వెల్లడించారు. మల్లంపాటి ఆదిరెడ్డి మంచినీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల తనయుడు విష్ణు రెడ్డి, పూజారులు మురళీకృష్ణమాచార్యులు, వాసు, గురుస్వాములు గంజి సుబ్బారావు, కొండయ్య, కాటూరి ప్రసాద్, వెంకటరావు, కాటూరి నారాయణ ప్రతాప్, తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిర కాలేజ్‌లో క్యాంపస్ డ్రైవ్

- 104 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

మార్కాపురం: స్థానిక ఇందిర ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు చైర్మన్, ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డి తెలిపారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో డైకిన్, బ్లూస్టార్, ఐసన్ ఆటో స్పేర్స్ లాంటి మల్టీ నేషనల్ సంస్థలు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు రాత పరీక్ష అనంతరం మౌఖిక పరీక్షలు నిర్వహించి 104 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉద్యోగ సాధన కోసం కావాల్సిన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన ఇందిర కళాశాల విద్యార్థులు

ఘనంగా తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి వార్షికోత్సవం


క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న యూత్ సభ్యులు

మార్కాపురం: పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి 27వ సంఘ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన జి.బ్రెనాల్డ్ వాక్య సందేశం అందించారు. క్రీస్తు బోధనలు అనుసరిస్తే సమాజంలో శాంతి, సౌభాగ్యాలు విలసిల్లుతాయన్నారు. తోటివారి పట్ల ప్రేమ, దయ, కరుణ చూపాలని, దాన ధర్మాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. సండే స్కూల్ విద్యార్థుల నృత్య రూపకాలు, యువత ఆలపించిన పాటలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. చర్చి పెద్దలను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దేవరకొండ సామ్యేలు, ఉపాధ్యక్షులు విడుదల కిరణ్, కోశాధికారి సి.రామస్వామి, సంఘ పాస్టర్ పులుకూరి అమృతతేజ్, సభ్యులు పోలయ్య, ఆర్థర్, సతీష్, సుజాత, విజయకుమారి, ప్రదీప్, శరణ్‌కుమార్, సండే స్కూల్ సూపరింటెండెంట్ గంగాభవాని, యూత్ డైరెక్టర్ డి.సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ



కంభం: కందులాపురం పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు ఆదివారం భూతపాటి బ్రదర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు దానియేలు మాట్లాడుతూ.. సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. వాహనదారుల అవస్థ


కంభం : గుంతలమయంగా రావిపాడు రోడ్డు


కంభం : అధ్వానంగా తయారైన కందులాపురం రహదారి

- అధ్వానంగా తయారైన ఆర్‌అండ్‌బీ రహదారులు
- దుమ్ము రేగుతున్న రోడ్లపై ప్రయాణికుల కష్టాలు
- దెబ్బతిన్న మార్జిన్లతో తరచూ ప్రమాదాలు
- అడ్డగోలు ప్యాచ్ వర్క్‌తో రహదారులపై ఎత్తుపల్లాలు


కంభం : గుంతలమయమైన అర్ధవీడు రోడ్డులో ప్రయాణికులతో వెళ్తున్న ఆటో


కంభం : రోడ్డుపై దుమ్ము రేగుతుండటంతో వెళ్లలేక ఆగిపోయిన వాహనదారుడు

కంభం/పొదిలి: నిత్యం బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఆర్‌అండ్‌బీ రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కంభం నుంచి అర్ధవీడు, తురిమెళ్ల, కందులాపురం, రావిపాడు ఎక్కువగా వాహనాలు తిరుగుతుంటాయి. అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లి, వెలగలపాయ లోయకు ఎక్కువగా ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో ప్రజలు వెళ్తుంటారు. రోడ్లు గుంతలుగా, మార్జిన్లు అధ్వానంగా ఉండటంతో బస్సులు, ఆటోలు వెళ్లే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ముందు బస్సు కానీ, ఏదైనా పెద్ద వాహనాలు వెళ్తుంటే దుమ్ము ధూళి రేగుతుండటంతో వెనుక వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. బస్సుల్లో ప్రయాణికులు సైతం గుంతల రోడ్లపై ప్రయాణం చేయలేక ఆపసోపాలు పడుతున్నారు. కందులాపురం వెళ్లే మార్గంలో రోడ్డు మార్జిన్లు దెబ్బతినడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కంభం నుంచి కార్లలో ఒంగోలు వెళ్లే వారు రావిపాడు రోడ్డును వినియోగిస్తుంటారు. అయితే ఆ రహదారి కుంచించుకుపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోంది. రహదారులు అధ్వానంగా తయారవడంతో గమ్య స్థానాలకు చేరుకోవడానికి అధిక సమయం పడుతోందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులను పాలకులు గాలికొదిలేయడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పొదిలి-మార్కాపురం రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడటంతో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. రాయచూర్, కర్నూలు, శ్రీశైలంతోపాటు మార్కాపురం చుట్టుపక్కల ప్రాంతాల వారు బస్సులు, కార్లలో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్లపై అడుగడుగునా ఏర్పడిన గుంతల కారణంగా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్యాచ్‌లు వేసిన చోట రెండు, మూడు అంగుళాల మేర రోడ్డు ఎత్తుగా ఉంది. దీంతో కంకర లేచి వాహనాల వేగం మందగిస్తోంది. దొనకొండ అడ్డరోడ్డు వరకు సుమారు 13 కిలోమీటర్లు ఉండగా, కేవలం రెండు మూడు కిలోమీటర్ల మేర మాత్రమే రోడ్డు బాగుంది. మిగిలినదంతా గుంతలు, ప్యాచ్ వర్కులతో అడ్డదిడ్డంగా తయారైంది. అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


పొదిలి : భట్టువారిపల్లి సమీపంలో రహదారిపై గుంతలు


పొదిలి : మాదాలవారిపాలెం సమీపంలో రోడ్డుపై గుంతలు


పొదిలి : సలకనూతల సమీపంలో దెబ్బతిన్న ప్యాచ్